సాక్షి విశాఖపట్నం

శనివారం : 23 : మార్చి : 2024



ఈకోర్నా, ప్రకాశం జట్ల విజయం

డీఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నీలో ఈకోర్నా, ప్రకాశం జిల్లా మెన్ జట్లు తొలి మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. IIలో



సిటీలో 'కలియుగం పట్టణంలో'

'కలియుగం పట్టణంలో' చిత్రం విజయవంతం చేయాలని హీరో విశ్వ కార్తికేయ, హీరోయిన్ ఆయూషి పటేల్ కోరారు. IIలో

నాడు వంచన.. నేడు ఆసరా



డ్వాక్రా సంఘాలను నాడు చంద్రబాబు మోసం చేస్తే.. నేడు సీఎం జగన్ హయాంలో అతివలు మహారాణుల్లా వెలుగొందుతున్నారు. వైఎస్సార్ ఆసరాతో బతుకులకు భరోసా కల్పించారు. IIలో

న్యూస్‌రీల్

ఎర్త్ అవర్ పాటించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువతులు

బీచ్‌రోడ్డు: వాతావరణ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా శనివారం నిర్వహించనున్న ఎర్త్ అవర్‌ను ప్రతీ ఒక్కరు పాటించాలని బీచ్ సందర్శకులను విద్యార్థులు కోరారు. క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ అండ్ ఫ్రైడే ఫర్ ఫ్యూచర్ ఏపీ సంయుక్తంగా ఎర్త్ అవర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవరాశి ఉనికి ప్రశ్నార్థకంగా మారినందున భూమిని కాపాడుకుందాం..పర్యావరణాన్ని రక్షించుకుందాం అంటూ విద్యార్థినులు నినదించారు. ఎర్త్ అవర్‌లో భాగంగా ఒక గంట పాటు విద్యుత్ వినియోగాన్ని పూర్తిగా ఆపివేయాలని పిలుపునిచ్చారు.

నేడు వెంకయ్యనాయుడు రాక

మహారాణిపేట: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి 12.40 గంటలకు సాగర్‌నగర్‌లోని తన ఇంటికి చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటలకు సాగర్‌నగర్ ఇంటి నుంచి బయలుదేరి నోవెటల్ హోటల్‌కు వెళతారు. అక్కడ జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొని తిరిగి సాయంత్రం 6.40 గంటలకు విశాఖపట్నం పోర్టు గెస్టుహౌస్‌కు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

మిజోరం గవర్నర్ కూడా..

మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు శనివారం విశాఖ వస్తున్నారు. ఈనెల 31వ తేదీ వరకు ఆయన విశాఖలో ఉంటారు. హరిబాబు తన పర్యటనలో భాగంగా కృష్ణ, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో పర్యటిస్తారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

మహారాణిపేట: షెడ్యూలు విడుదలైన నాటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, ఇతర బిల్లులపై ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర రాజకీయ ప్రతినిధుల ఫొటోలు గానీ, వారి సందేశాలు గానీ ఉండరాదని తెలిపారు. ఎన్నికల షెడ్యూలుకు ముందు జారీచేసిన లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు, శిలా ఫలకాలపై ప్రచురించిన ఫొటోలు, రాజకీయ ప్రతినిధుల సందేశాలలో ఎటువంటి జోక్యం అవసరం లేదన్నారు.

మత్స్యకారులపై మమకారం!



- ఆ వర్గానికి వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం
- 'వాసుపల్లి'కి విశాఖ దక్షిణ కేటాయింపు
- కోలా గురువులుకు ఇప్పటికే కీలక పదవులు
- విజయ్ చందర్‌కు మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ గిరీ
- తెలుగుదేశం, జనసేనలు మొండి చెయ్యి
- మండిపడుతున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం : ఇన్నాళ్లూ తెలుగుదేశం పార్టీ మత్స్యకారుల ఓట్లకు 'గాలం' వేసి లబ్ధి పొందడమే తప్ప వారికి తగిన గుర్తింపునివ్వడం గాని, వారి సంక్షేమానికి పాటు పడిన పరిస్థితి గాని లేదు. రాజకీయంగానూ వీరికి కీలక పదవుల్లో ప్రాధాన్యతనిచ్చిన పాపాన పోలేదు. ఎన్నికల్లో కరివేపాకుల్లో వారిని వినియోగించుకుని ఆనక 'తెడ్డు' చూపించడం ఆ పార్టీకి ఆనవాయితీగా వస్తోంది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి ఉంది. జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీలో మత్స్యకారులకు పెద్ద పీట వేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారులకు కీలక పదవులు ఇస్తూ వారి పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకుంటున్నారు. పార్టీ పదవులే కాదు.. ప్రజా ప్రతినిధులుగా గెలుపొందేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వారు రాజకీయాల్లోనూ రాణించేందుకు దోహదపడుతున్నారు. విశాఖ జిల్లా విషయానికొస్తే.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం అభ్యర్థిగా మత్స్యకార సామాజికవర్గానికి చెందిన వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ప్రకటించారు. ఈ జిల్లాలో తెలుగుదేశం పార్టీలో ఒక్క నియోజకవర్గం నుంచి కూడా మత్స్యకారునికి పోటీ చేసే అవకాశం ఇవ్వకపోవడం విశేషం. అలాగే మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి తొలుత కోలా గురువులును చైర్మన్‌ను చేశారు. అనంతరం గురువులుకు ప్రతిష్టాత్మక వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షునిగాను, డీసీసీబీ చైర్మన్‌గాను ఛాన్స్ ఇచ్చారు. గురువులు స్థానంలో పేర్ల విజయచందర్‌ను మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు.

ప్రతిపక్షాలపై గంగపుత్రుల ఆగ్రహం

తమకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేనల్లో ఎవరు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారన్న దానిపై మత్స్యకారుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మత్స్యకారుల జనాభా అధికంగా ఉన్న విశాఖ జిల్లాలో ఒక్కరంటే ఒక్కరికీ టీడీపీ, జనసేన పార్టీలు టిక్కెట్లు కేటాయించకపోవడంపై వారు మండిపడుతున్నారు. ఇన్నాళ్లూ తమ ఓట్లు వేయించుకుని ఈ ఎన్నికల్లో తమను పక్కన పెట్టేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ ప్రభుత్వాల హయాంలో తమకు ఎవరు ఎక్కువ గుర్తింపు ఇచ్చారో వీరు బేరీజు వేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ రాజకీయంగాను సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తోందని పేర్కొంటున్నారు.

టీడీపీలో గుర్తింపేది?



టీడీపీ అధినేత చంద్రబాబు మత్స్యకారులను ఓటు బ్యాంకుగానే చూస్తారు. ఎన్నికల్లో మత్స్యకారులను మభ్యపెట్టి ఓట్లు వేయించుకునే వారు తప్ప ఏనాడూ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. గుర్తింపు ఇవ్వలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల స్థితిగతులనే మార్చేశారు. రాజకీయంగానూ పెద్ద పీట వేస్తున్నారు. మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా మంచి గుర్తింపునిచ్చారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం టికెట్టు వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కేటాయించారు. టీడీపీ, జనసేనలు మాత్రం జిల్లాలో ఎక్కడా మత్స్యకారులకు సీటివ్వలేదు. ప్రస్తుత ఎన్నికల్లో మత్స్యకారులు కూటమి పార్టీలకు తగిన బుద్ధి చెబుతారు.

– పేర్ల విజయచందర్, చైర్మన్, మత్స్యకార కార్పొరేషన్

మరెవ్వరూ ఇవ్వనంత ప్రాధాన్యత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మత్స్యకారులంటే ఎంతో మమకారం. ఆయన అధికారంలోకి వచ్చాక మా సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారు. అంతేకాదు.. రాజకీయంగానూ ఎదగడానికి అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు. చంద్రబాబు పాలనలో మత్స్యకారులకు మేలు మాట దేవుడెరుగు. అవమానాల పాల్జేశారు. ఛీత్కారాలకు గురిచేశారు. సీఎం జగన్ తీరు అందుకు విరుద్ధం. నాలాంటి వారికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష పదవే కాదు.. డీసీసీబీ చైర్మన్ కిరీటాన్ని కూడా కట్టబెట్టారు. వాసుపల్లి గణేష్‌కుమార్‌కు విశాఖ దక్షిణ టికెట్టు నిచ్చి మత్స్యకారుల పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. టీడీపీ, జనసేనలు మత్స్యకారులెవ్వరికీ సీటివ్వకపోవడం మాపై వారికున్న అభిప్రాయాన్ని తెలియజేస్తోంది.

– కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్

టీడీపీకి వాడుకుని వదిలేయడమే తెలుసు



టీడీపీకి మత్స్యకారులను వాడుకుని వదిలేయడమే తెలుసు. ఈ ఎన్నికల్లో జిల్లాలో మాకు ఒక్క సీటు కూడా కేటాయించలేదు. ఓటుతో టీడీపీకి తగిన బుద్ధి చెబుతాం. విశాఖ దక్షిణ సీటును మత్స్యకారులకు కేటాయించి సీఎం వైఎస్ జగన్ మా పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఎంతో ఓటు బ్యాంకున్న మమ్మల్ని చంద్రబాబు విస్మరించారు. కోలా గురువులకు కీలకమైన డీసీసీబీ చైర్మన్‌తో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష పగ్గాలు కూడా అప్పగించారు. మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేర్ల విజయచందర్‌కు చైర్మన్ పదవినిచ్చారు. రాజకీయంగా వైఎస్ జగన్‌లా మరే నాయకుడూ మత్స్యకారులకు ప్రాధాన్యతనివ్వలేదు.

– కొవిరి కొర్లయ్య, మత్స్యకార నాయకుడు, గంగవరం

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రతినిధులు



మహిళలకు విష్ణుకుమార్ రాజు క్షమాపణలు చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ మహిళా నేతల డిమాండ్
- మాజీ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు
- ప్లకార్డులతో నిరసన

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆ పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళలు మద్యం సేవించి చంద్రబాబుపై బూతులు మాట్లాడారని విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. IIలో

మూడు రోజులుగా పోర్టులో హడావుడి

- మంగళవారం ఉదయం పోర్టుకు చేరుకున్న సీబీఐ
- కంటైనర్స్ మొత్తం తమ ఆధీనంలోకి తీసుకునేందుకు యత్నం
- కస్టమ్స్ అడ్డు చెప్పడంతో.. తనిఖీల నిర్వహణకు బ్రేక్
- కొత్త సాంకేతికతతో తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పదంగా కంటైనర్
- డ్రగ్స్ దొరికిన కంటైనర్‌లో మరికొన్ని శాంపిళ్ల సేకరణ
- పోర్టు అధికారులకు సమాచారమివ్వని వైనం
- కంటైనర్ టెర్మినల్ సిబ్బందిపై పోర్టు ఉన్నతాధికారుల ఆగ్రహం

సాక్షి, విశాఖపట్నం: భారీ మొత్తంలో డ్రైఈస్ట్ మాటున డ్రగ్స్ పట్టుబడిన ఘటనతో విశాఖ ఉలిక్కి పడింది. మూడు రోజులుగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ).. విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యంలో నడుస్తున్న కంటైనర్ టెర్మినల్‌ను తన ఆధీనంలోకి తీసుకుంది. శుక్రవారం మరికొన్ని కంటైనర్లను కస్టమ్స్‌తో కలిసి తనిఖీలు నిర్వహించింది. డ్రగ్స్ దొరికిన కంటైనర్‌లో మరికొన్ని శాంపిళ్లను సేకరించి.. ఫోరెన్సిక్ సాయంతో పరీక్షలు నిర్వహించింది. మరోవైపు తొలి రోజునుంచి కంటైనర్ టెర్మినల్‌లో డ్రామా కొనసాగుతోంది. కస్టమ్స్ ఆధీనంలో ఉన్న పోర్టును తమ పరిధిలోకి తీసుకోవాలని భావించింది. ఆ తర్వాత కస్టమ్స్ అనుమతి తీసుకొని తనిఖీలు చేపట్టింది. ఇదిలా ఉండగా తమ ప్రాంతంలో ఇంత జరుగుతున్నా చివరి నిమిషం వరకూ సమాచారం ఇవ్వకపోవడంతో పోర్టు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ పోల్ సమాచారంతో మంగళవారం ఉదయం విశాఖపట్నం పోర్టుకు చేరుకున్న సీబీఐ.. కంటైనర్ టెర్మినల్‌లోని మొత్తం కంటైనర్లను తనిఖీ చేసేందుకు ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న కస్టమ్స్ అధికారులు.. అలా చేయడం కుదరదని తెగేసి చెప్పారు. నిబంధనల ప్రకారం అన్ని కంటైనర్లూ స్కానింగ్ చేసిన తర్వాత.. వాటికి సంబంధించిన కస్టమ్స్ నిబంధనలను పూర్తి చేసుకున్న తర్వాతే అప్పగించడం జరుగుతుందని చెప్పారు. కస్టమ్స్ నిబంధనలు పూర్తయిన తర్వాతే.. సీబీఐ తనిఖీల ప్రక్రియ చేపట్టింది.



ఈ మొబైల్‌స్కానర్ ద్వారానే డ్రగ్స్ బయటపడ్డాయి...

కొత్త వ్యవస్థతో ఇట్టే పసిగట్టేశారు

డ్రైఈస్ట్‌లో డ్రగ్స్‌ను మిక్స్ చేస్తే.. సాధారణంగా చూస్తే ఎవరూ పసిగట్టలేరు. కానీ విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) అందుబాటులోకి తీసుకొచ్చిన అత్యాధునిక సాంకేతికత.. ఈ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేసింది. సాధారణంగా పోర్టుకు వచ్చే కంటైనర్‌ను పూర్తిస్థాయిలో కస్టమ్స్ అధికారులు పరిశీలించి అందులో ఏ సరుకు లోడ్ అయ్యింది.? ఇంకా అదనంగా ఏమైనా రవాణా చేస్తున్నారా.? అనే విషయాల్ని పూర్తిస్థాయిలో పరిశీలించి.. అనంతరం బయటకి పంపిస్తారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తవ్వడానికి దాదాపు అరగంట సమయం పడుతుంది. దీనివల్ల విశాఖ పోర్టులో కంటైనర్ డిస్పాచ్ అనేది చాలా ఆలస్యంగా సాగుతుంది. ఆ సమస్యను పరిష్కరించేందుకు విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ).. కేవలం 3 నిమిషాల్లో కంటైనర్‌ని స్కాన్ చేసి డిస్పాచ్ చేసేలా అధునాతన సాంకేతిక వ్యవస్థను 2022లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మొబైల్ కంటైనర్ స్కానింగ్ వ్యవస్థ సాఫ్ట్‌వేర్‌కు అనుగుణంగా నడుస్తుంది. వచ్చిన కంటైనర్‌లో ఉన్న సరుకు ఏమిటో ముందుగానే కస్టమ్స్‌కు సమాచారం ఉంటుంది. స్కాన్ చేసినప్పుడు ఆ కార్గో మాత్రమే కంటైనర్‌లో ఉందా లేదా అనేది.. క్షణాల్లో పసిగట్టేస్తుంది. మొత్తం కంటైనర్లలో ఏ కంటైనర్‌ను స్కాన్ చేయమని సాఫ్ట్‌వేర్ చెబుతుందో దాన్నే కస్టమ్స్ అధికారులు స్కాన్ చేస్తారు. ఇందులో భాగంగానే.. ఎస్ఈకేయూ 4375380 నంబర్ కంటైనర్‌లో అనుమానస్పద కార్గో ఉన్నట్లు గుర్తించింది.

కస్టమ్స్‌కు మాత్రమే తెలుస్తుంది

కంటైనర్‌లో ఏ సరకు ఉందనేది పోర్టుకు ఎలాంటి సమాచారం ఉండదు. కేవలం ఎన్ని కంటైనర్లు వస్తున్నాయి.. షిప్ ఎప్పుడు వస్తుంది. ఏ సమయానికి బెర్తింగ్ ఇవ్వాలన్నది మాత్రమే పోర్టు పరిధిలో ఉంటుంది. అయితే కంటైనర్స్‌లో ఏ సరకు ఉందన్నది కస్టమ్స్‌కు కచ్చితంగా సమాచారం మ్యానిఫెస్టో రూపంలో అందిస్తారు. దీన్నే ఇంపోర్ట్ జనరల్ మ్యానిఫెస్టో (ఐజీఎం) అంటారు. ఈ ఐజీఎం ప్రకారమే కస్టమ్స్ అనుమతులు మంజూరు చేస్తుంటుంది. ఈ ఐజీఎంలో పొందుపరిచిన సరకు, కార్గోలో వచ్చిన సరుకు ఒకటా కాదా అన్నది సీల్ ఓపెన్ చేసి తనిఖీలు చేస్తారు. రెండూ ఒకటే అయితే కార్గో హ్యాండ్లింగ్‌కు కస్టమ్స్ అధికారులు అవుట్‌ఆఫ్ ఛార్జ్ (ఓఓసీ) అనుమతులు జారీ చేస్తారు. చెల్లించాల్సిన కస్టమ్స్ సుంకాన్ని వసూలు చేసి సరుకును బయటికి పంపిస్తారు. డిక్లరేషన్‌లో సరకు ఒక్కటి కాదని తేలితే.. వాటిని సీజ్ చేసి కేసు ఫైల్ చేస్తారు.

మరికొన్ని శాంపిల్స్ పరిశీలన

శుక్రవారం కూడా సీబీఐ అధికారులు పోర్టులోనే తిష్టవేశారు. మరోసారి కస్టమ్స్ సహకారంతో కొన్ని కంటైనర్స్‌ను స్కానింగ్ చేశారు. ఎక్కడా అలాంటి సంకేతాలు రాకపోవడంతో.. మరోసారి పాత కంటైనర్‌ని పరిశీలించారు. అందులో మిగిలి ఉన్న కొన్ని బస్తాల నుంచి 150 వరకూ శాంపిళ్లను తీసుకొని పరీక్షించారు. ఇందులో డ్రగ్స్ శాంపిల్స్ ఉన్నాయా లేదా అనే విషయాల్ని రెండురోజుల్లో వెల్లడిస్తామని సీబీఐ వర్గాలు స్పష్టం చేశాయి.

పోర్టు ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా..?

రెండు రోజులుగా ఇంత తంతు నడుస్తున్నా విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) అధికారులకు కనీస సమాచారం ఇవ్వలేదు. దీనిపై పోర్టు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ వ్యవహారంపై ఎందుకు సమాచారం ఇవ్వలేదని తమ అనుబంధంగా నడుస్తున్న విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రై.లి.(వీసీటీపీఎల్) అధికారులకు వివరణ అడగాలని సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పరిధిలో జరుగుతున్న తనిఖీల అంశంపై కనీసం సమాచారం చివరి నిమిషం వరకూ ఎందుకు ఇవ్వలేదో వివరణ ఇవ్వాలని ఉన్నతాధికారులు వీసీటీపీఎల్ అధికారుల్ని ఆదేశించినట్లు తెలుస్తోంది.

నీవు నేర్పిన విద్యయే 'నారా'జాక్ష

పెందుర్తిలో పొత్తుపాట్లు

- ముందురోజు జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు మద్దతు
- మరునటి రోజు టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తికే టికెట్ ఇవ్వాలని నిరసన
- పెందుర్తి నియోజకవర్గ ద్వితీయ శ్రేణి టీడీపీ నాయకుల డబుల్ గేమ్
- విస్తుపోతున్న టీడీపీ కేడర్.. అయోమయంలో జనసేన నేతలు

పెందుర్తి: ఇంటి పెద్ద నడవడికను బట్టి..ఆ కుటుంబంలో మిలిగిన వారి వ్యవహారశైలి ఉంటుంది. కచ్చితంగా ఇంటి పెద్ద ప్రభావం కాస్తో కూస్తో పడుతుంది. మరి అక్కడున్న పార్టీ పెద్ద వెన్నుపోటు పొడవడంలో ఘనాపాటి. ఆయన వెన్నుపోటు రాజకీయాలను అడుగడుగునా అందిపుచ్చుకున్నారు పెందుర్తి తెలుగు తమ్ముళ్లు. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష.. అనే సామెత.. ఇప్పుడు పెందుర్తిలో నీవు నేర్పిన విద్యయే 'నారా'జాక్షగా మారింది. తెలుగుదేశం–జనసేన మధ్య పొత్తుపాట్లు ఏంటో తెలుసుకోవాలంటే.. ఈ కథనం చదవాల్సిందే..

పెందుర్తి తెలుగుదేశం ద్వితీయశ్రేణి నేతలు ప్లేటు ఫిరాయింపులతో జనసేన నేతలు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. 'పొత్తులో భాగంగా ఇరు పార్టీల పెద్దలు కలిసి మంచి నిర్ణయం తీసుకున్నారు. జనసేన నుంచి మీకు (పంచకర్ల రమేష్‌బాబు) టికెట్ ఇవ్వడం మాకు ఎంతో ఆనందం కలిగింది. బండారు సత్యనారాయణమూర్తి మద్దతు ఉన్నా లేకపోయినా.. మేమంతా మీతోనే ఉంటాం. టీడీపీ ఓట్లన్నీ మీకే పడేలా చూస్తాం' అని బుధవారం జనసేన నేత పంచకర్ల రమేష్‌బాబుతో పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుల హామీ ఇచ్చారు.

'మా బండారు సత్యనారాయణమూర్తికి అన్యాయం జరిగింది. టీడీపీ అధిష్టానం పునరాలోచన చేయాలి. జనసేనకు టీడీపీ ఓట్లు ఎట్టి పరిస్థితిలోనూ పడవు. అదే టీడీపీ నుంచి అభ్యర్థి అయితే ఎలాంటి ఇబ్బంది లేదు. సీనియారిటీ బట్టి అయినా బండారు సత్యనారాయణమూర్తికి టికెట్ ఇవ్వాలి. లేకపోతే మేమంతా పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తాం' గురువారం సబ్బవరం కేంద్రంగా అదే టీడీపీ నాయకుల యూటర్న్ వాఖ్యల చేయడం చర్చనీయాంశమైంది..



బుధవారం: జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబును కలిసి మద్దతు ప్రకటించిన పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు

వెన్నుపోటు 2.0

మాట మార్చడంలో టీడీపీ అధినేత చంద్రబాబును మించిపోయారు పెందుర్తి తెలుగుదేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థిగా దాదాపు ఖరారైన జనసేన నేత పంచకర్ల రమేష్‌బాబుకు టీడీపీ నాయకులు ఒక్కరోజు తిరగకముందే జలక్ ఇచ్చారు. బుధవారం పంచకర్ల నివాసంలో ఆయనను కలిసి మా సంపూర్ణ మద్దతు మీకే అంటూ నమ్మబలికి..24 గంటలు తిరగక ముందే గురువారం సాయంత్రం సబ్బవరం మండల కేంద్రంలో అదే టీడీపీ నాయకులు బండారు సత్యనారాయణమూర్తికి టికెట్ కేటాయించాలంటూ నిరసన తెలిపారు. ఈ పరిణామం చూసి ఒక్కసారిగా టీడీపీ శ్రేణులు ఉలిక్కి పడగా..జనసేన నేతలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. టీడీపీ నాయకుల డబుల్ గేమ్‌తో పంచకర్ల అనుచరులు తలలు పట్టుకుంటున్నారు.



గురువారం: టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తికి టికెట్ కేటాయించాలని నిరసన తెలుపుతున్న టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు

ఛీఛీ ఇవేం వెన్నుపోటు రాజకీయాలు

సాధారణంగా రాజకీయాల్లో రెండు పార్టీ మధ్య పొత్తు కుదిరితే ఎవరికి టికెట్ వచ్చినా మిగిలిన పార్టీ వారు సహకరించడం సర్వసాధారణం. కానీ పెందుర్తి టికెట్ విషయానికి వస్తే టీడీపీ నుంచి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో పొత్తులో భాగం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తమకు కేటాయించిన 21 సీట్లలో పెందుర్తిని చేర్చి కూటమి నుంచి పంచకర్ల రమేష్‌బాబుకి మాటిచ్చారు. ఇప్పటికీ అధికారికంగా ప్రకటించకపోయినా దాదాపు రమేష్‌బాబుకే టికెట్ అని జనసేన నేతలు గట్టిగా నమ్ముతున్నారు. ఈ మేరకు రమేష్‌బాబు కూడా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం పెందుర్తి, సబ్బవరం, పరవాడకు చెందిన టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులంతా పంచకర్లను కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అయితే వెన్నుపోటుకు మారుపేరైన టీడీపీ నాయకులు ఒక్కసారిగా యూటర్న్ తీసుకున్నారు. బుధవారం సబ్బవరంలో పంచకర్లకు మద్దతు పలికిన టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులే బండారు సత్యనారాయణమూర్తికి మద్దతుగా అతనికి టికెట్ కేటాయించాలని..లేకపోతే తాము టీడీపీకి రాజీనామాలు చేస్తామని గురువారం హెచ్చరికలు జారీ చేశారు. పంచకర్లకు మద్దతుగా ఎట్టి పరిస్థితిలోనూ పనిచేయబోమని తేల్చి చెప్పారు. దీంతో జనసేన కార్యకర్తలు, నేతలు ఛీఛీ ఇవేం రాజకీయాలు..ఇదేం పొత్తు ధర్మమంటూ టీడీపీ నేతలను ఛీదరించుకుంటున్నారు.

ప్రచార అనుమతులు తప్పనిసరి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

మహారాణిపేట: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. విజయవాడ నుంచి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం –7, ఫారం–8లను మార్చి 26వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదు విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. చివరి నిమిషంలో హడావుడిగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టవద్దని, క్రమ పద్ధతిలో వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఫారం–6లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మాత్రమే నూతన ఓటర్లగా నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటువంటి కార్యక్రమాలకైనా, ఇంటింటి ప్రచారానికైనా ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళిలో భాగంగా జిల్లాలో అనుసరిస్తున్న విధానాలను, చేపడుతున్న చర్యలను జిల్లా నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సీఈవోకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

నాడు వంచన.. నేడు ఆసరా

ఆసరాతో ఎంతో మేలు జరిగింది



బోదువలసలో బేకరీ షాప్ నడుపుతున్న కోన అరుణ

నా పేరు కోన అరుణ. కుటుంబంతో కలసి బోదువలసలో నివాసం ఉంటున్నాను. 2013 నుంచి శ్రీ చైతన్య స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నాను. ఈ ప్రభుత్వం రాక ముందు గ్రూపులోని సభ్యులమంతా ఒక్కొక్కరం రూ.75 వేలు చొప్పున బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసుకున్న రుణం మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా ద్వారా మాఫీ చేసింది. రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుతం బేకరీ నిర్వహిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాను. నా భర్త శ్రీనుఆటో నడుపుతూ బేకరీ నిర్వహణలో సాయపడుతున్నారు. మా అబ్బాయికి అమ్మ ఒడి వచ్చింది. నా భర్తకు 10 వేలు చొప్పున వాహన మిత్ర అందుతోంది. మా అత్తకు వైఎస్సార్ చేయూత, మామయ్యకు రైతుభరోసా జమవుతోంది. సొంతింటి కలను కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చింది. ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి అందించడంతో పాటు గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఇంటి శ్లాబ్ పూర్తయింది. తుది దశకు పనులు చేరుకున్నాయి.

సీఎం జగన్‌తో బతుకులకు భరోసా



వాంబేకాలనీలో పాన్ షాపు నడుపుతున్న లక్ష్మి

నా పేరు వజ్రగట్టు లక్ష్మి. వాంబేకాలనీలో నివాసం ఉంటున్నాను. మా లాంటి డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగిందంటే.. అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే... చంద్రబాబు సున్నా వడ్డీ అన్నారు.. ఎగ్గొట్టారు. రుణమాఫీ అన్నారు.. మోసం చేశారు. కానీ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశారు. నా పిల్లలకు పెళ్లిళ్లు అయి.. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నా భర్త సెక్యూరిటీ గార్డ్. ఆయన జీతం కుటుంబ పోషణకు సరిపోవడం లేదు. మా డ్వాక్రా సంఘం దైవ కృషకు ప్రభుత్వం రుణం మంజూరు చేయగా.. నా వాటాగా రూ.60 వేలు వచ్చింది. ఈ మొత్తంతో వాంబేకాలనీ 41ఆర్, జీఎఫ్–3కి సమీపంలో పాన్ షాపు పెట్టుకున్నాను. కొంత మొత్తం రుణం చెల్లించగా.. మిగిలిన మొత్తాన్ని రూ.12,200 చొప్పున మూడు సార్లు ప్రభుత్వం రుణమాఫీ చేసింది. దీంతో రుణ విముక్తి లభించింది. షాపు ద్వారా రోజుకు రూ.200 వరకు సంపాదిస్తున్నాను. ఈ మొత్తం కుటుంబ అవసరాలకు ఉపయోగిస్తున్నారు.

రూ.7.32 లక్షల రుణమాఫీ జరిగింది



నా పేరు కె.మంగవేణి. అక్కయ్యపాలెం లోని శ్రామికనగర్‌లో నివాసం ఉంటున్నాను. సత్యదానంద పొదుపు సంఘం అధ్యక్షురాలిగా 17 ఏళ్లుగా ఉన్నా. 2019 ప్రారంభంలో మా గ్రూపులో ఉన్న 10 మంది కలిసి రూ.7.50 లక్షలు రుణం తీసుకున్నాం. రెండు నెలలు వాయిదాలు కట్టాం. ఇంతలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టు రూ.7.32 లక్షలు రుణమాఫీ జరిగింది. గ్రూపులో ప్రతీ సభ్యురాలికి రూ.18,300 చొప్పున నాలుగు విడతలుగా ఆసరా డబ్బులు జమయ్యాయి. కరోనా సమయంలో కూలి పనులు లేక.. చేతికి డబ్బులు అందక పిల్లల పోషణకు సైతం ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వానికి ఆదాయం లేకపోయిన ఆ సమయంలో ఆసరా డబ్బులు జమ చేసింది. అప్పుడు ఇంటి ఖర్చులకు చాలా ఉపయోగపడ్డాయి. తెలుగుదేశం ప్రభుత్వంలో డ్వాక్రా రుణమాఫీ అనడమే కాని ఎప్పుడూ జరగలేదు. సీఎం జగన్ చేసిన మేలు ఎప్పటికీ మర్చిపోం.

- డ్వాక్రా సంఘాలను మోసం చేసిన చంద్రబాబు
- వాయిదాలు చెల్లించక అప్పుల పాలైన మహిళలు
- కోర్టు ద్వారా నోటీసులిచ్చిన బ్యాంకర్లు
- సీఎం జగన్ హయాంలో మహారాణుల్లా అతివలు
- వైఎస్సార్ ఆసరాతో బతుకులకు భరోసా
- నాలుగు విడతల్లో రుణమాఫీ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం, నర్సీపట్నం, సబ్బవరం, మధురవాడ, పెదగంట్యాడ, సీతంపేట: పొదుపు ఉద్యమం.. మహిళల్లో క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనం. రూపాయి రూపాయి కూడబెట్టి దాన్ని పరపతిగా చూపి.. తీసుకున్న కొద్దిపాటి అప్పులతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించారు. తమ కాళ్ల మీద తాము నిలబడడమే కాదు.. కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఉవ్వెత్తున ఎగసిన పొదుపు ఉద్యమానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖరరెడ్డి పావలా వడ్డీ పథకంతో ఊతమిచ్చారు. ప్రతి మహిళను లక్షాధికారి చేయాలని తపించారు. ఆ దిశగా కృషి చేశారు. అంతటి గొప్ప చరిత్ర కలిగిన డ్వాక్రా ఉద్యమం చంద్రబాబు హయాంలో కునారిల్లిపోయింది. ఈ పరిస్థితికి కారణం 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన డ్వాక్రా రుణమాఫీ హామీయే. ఈ హామీ ఐదేళ్లలో ఎన్నో వేల కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసింది. ఆనందాన్ని చిదిమేసింది. బాబు ఇచ్చిన హామీ పుణ్యమాని వాయిదాలు కట్టని పాపానికి డ్వాక్రా అక్కాచెల్లెమ్మలు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురించింది. కానీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. అక్క చెల్లెమ్మలకు ఆసరాగా నిలిచారు. బాబు ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చి.. మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. స్వయం సహాయక బృందాల బతుకులకు భరోసా ఇచ్చారు.

చంద్రబాబు మాటలు నమ్మకూడదన్నది అందరూ చెప్పే మాటే. కానీ డ్వాక్రా మహిళలు ఈసారైనా బాబు బుద్ధి మారుంటుందిలే.. అని భావించి 2014లో డ్వాక్రా రుణ మాఫీ హామీ ఇవ్వడంతో సపోర్ట్ చేశారు. కానీ.. బాబు బుద్ధి మారలేదని వారికి తెలుసుకోడానికి ఎంతో సమయం పట్టలేదు. మాఫీ లేదు.. గీఫీ లేదు.. తీసుకున్న రుణాలు చెల్లించాలంటూ చంద్రబాబు ప్రభుత్వం హుకుం జారీ చేసింది. రుణమాఫీ అవుతుందని భావించి.. సకాలంలో వాయిదాలు కట్టకపోవడంతో జిల్లాలో వేల సంఘాల సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యారు. దీంతో 2018–19 నాటికి పూర్తిగా డిఫాల్ట్ లిస్ట్‌లోకి అయిన సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో 150, అర్బన్ ప్రాంతాల్లో 125 వరకు ఉన్నాయి. వడ్డీ, చక్ర వడ్డీలు కలిపి ఏడు నుంచి పది లక్షల వరకు బకాయిలు పేరుకుపోయిన సంఘాలు గ్రామీణ ప్రాంతంలో 192, అర్బన్ ప్రాంతంలో సుమారు 300 వరకు ఉన్నాయి. ఈ సంఘాల్లోని పొదుపు సొమ్ములనే కాదు.. చివరకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మంజూరైన పసుపు కుంకుమ సొమ్మును కూడా బ్యాంకులు తమ అప్పు ఖాతాలకు జమ చేసేశాయి. మిగిలిన బకాయిల కోసం పలు దఫాలు నోటీసులు ఇచ్చిన బ్యాంకర్లు కోర్టు ద్వారా కూడా నోటీసులు జారీ చేశాయి. దీంతో.. బాబు చేసిన మోసానికి తామే పాపం చేశామంటూ పొదుపు సంఘాల్లోని మహిళలు గగ్గోలు పెట్టారు.

వెలుగులు నింపిన సీఎం జగన్

ప్రజాసంకల్ప యాత్రలో అక్క చెల్లెమ్మల దుస్థితిని గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వారందరికీ 'ఆసరా'గా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి అనుగుణంగా 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైఎస్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక బృందాలు చెల్లించాల్సిన బకాయిలను సైతం వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. వైఎస్సార్ సున్నా వడ్డీతో రుణాలు మంజూరు చేయడం, వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున మంజూరు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి బాసటగా నిలిచారు. అతివలను అడుగడుగునా బాబు వంచనకు గురి చేయగా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రతి అడుగు వారి ఆర్థికాభివృద్ధి కోసమే అన్నట్లుగా భరోసానిచ్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపారు.



రుణమాఫీ జరిగిందిలా..

- విశాఖ జిల్లాలో 2019 ఏప్రిల్ 11 నాటికి 4,305 ఎస్‌హెచ్‌జీలకు ఉన్న రూ.700 కోట్లకు పైగా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేసింది.
- అనకాపల్లి జిల్లాలో 2019 ఏప్రిల్ 11 నాటికి 31,892 ఎస్‌హెచ్‌జీలకు ఉన్న రూ.992.57 కోట్ల బకాయిలను నాలుగు దఫాలుగా చెల్లించింది.
- అల్లూరి జిల్లాలో 2019 ఏప్రిల్ 11 నాటికి 39,743 సహాయక సంఘాలకు ఉన్న రూ.134.37 కోట్ల రుణాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగు దఫాలుగా జమ చేసింది.

బాబు కుట్రతో.. వెలివేసిన పరిస్థితులు

బకాయిల కోసం కోర్టు ద్వారా నోటీసులిప్పించడమే కాదు.. ఆ కుటుంబాల్లోని పిల్లలకు ఎస్సీ, బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నింది. ఆదరణ పనిముట్లు సైతం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టింది. హౌసింగ్ రుణాలు, చివరికి మరుగుదొడ్ల పేమెంట్స్ కూడా నిలిపేసింది. ఓ విధంగా చెప్పాలంటే ఆ కుటుంబాలను వెలివేసినట్టుగా చంద్రబాబు ప్రభుత్వం చేసింది. విచిత్రమేమిటంటే కోర్టు కేసుల కోసం అయ్యే ఖర్చులను ఆయా సంఘాల నుంచే వసూలు చేయడం గమనార్హం.

హాయిగా వ్యాపారం చేసుకుంటున్నా..



చినకోరాడలో బ్యాంగిల్ షాపు నిర్వహిస్తున్న సింహాచలం

నా పేరు జొమ్మల సింహాచలం. నేను చినకోరాడలో నివాసం ఉంటున్నాను. నా భర్త దుర్గాలు కూలి పనులు చేస్తుంటారు. నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శ్రీ కుంచుమాంబ స్వయం సహాయ సంఘంలో సభ్యురాలిని. మా సంఘానికి 2019లో రూ.5 లక్షల రుణం మంజూరైంది. అందులో నా వాటాకు రూ.50వేల రుణం వచ్చింది. ఆ డబ్బులతో నేను బ్యాంగిల్స్, టైలరింగ్ మెటీరియల్ దుకాణం పెట్టుకున్నాను. నేను ఒక వాయిదా చెల్లించాను. తర్వాత కొత్త ప్రభుత్వం వచ్చింది.. మిగిలిన రుణం మొత్తం కొత్త ప్రభుత్వం మాఫీ చేసింది. ఏడాదికి రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రుణ మాఫీ జరిగింది. దీంతో మాకు ఆర్థికంగా సాంత్వన కలిగింది. నేను ఇప్పుడు వ్యాపారం చేసుకుంటున్నాను. మా జీవితాలు సాఫీగా సాగుతున్నాయి.

అప్పుల నుంచి గట్టెక్కాం



కోనవానిపాలెంలో పాన్‌షాపు నిర్వహిస్తున్న ఈశ్వరమ్మ

నా పేరు వాకలగెడ్డ ఈశ్వరమ్మ. 74వ వార్డు కోనవానిపాలెం మా గ్రామం. నా భర్త వెంకటరాజు కూలి పనులు చేస్తుంటారు. నాకు ఇద్దరు కుమారులు. వారిద్దరికీ పెళ్లిళ్లు కావడంతో వారు వేరుగా ఉంటున్నారు. ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నేను శ్రీ దుర్గా సాయి గణేష్ స్వయం సహాయ సంఘంలో సభ్యురాలిని. మా సంఘానికి రూ.5,04,000 రుణం మంజూరైంది. నా వాటాకు రూ.50,400 వచ్చాయి. ఈ డబ్బులతో నేను పాన్‌షాపు ఏర్పాటు చేసుకున్నాను. నేను నా భర్త ఈ దుకాణంపైనే ఆధారపడి బతుకుతున్నాం. మాకు కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రుణాన్ని మాఫీ చేశారు. ఒక్కో విడత రూ.12,600 వంతున నాలుగు దఫాలుగా రుణమాఫీ జరిగింది. ఇప్పుడు మాకు అప్పు భారం లేదు.. వడ్డీ భారం లేదు.. హాయిగా బతుకుతున్నాం.

మహిళలకు విష్ణుకుమార్ రాజు క్షమాపణలు చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ మహిళా నేతల డిమాండ్
- మాజీ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

సీతమ్మధార : వైఎస్సార్ సీపీ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు భేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళలు మద్యం సేవించి చంద్రబాబుపై బూతులు మాట్లాడారని విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. ఉత్తర అభ్యర్థి కేకే రాజును విమర్శించడం సరికాదన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీని ఎదుర్కోలేక మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధిచెందాలనే భావనతో విశాఖను పరిపాలన రాజధాని చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి వ్యతిరేకంగా ఉన్న చంద్రబాబును ఆనాడు కె.కె.రాజు ఆధ్వర్యంలో తామంతా విశాఖ విమానాశ్రయంలో చంద్రబాబును అడ్డుకున్నామన్నారు. అయితే మద్యం సేవించి అడ్డుకున్నామని, బూతులు మాట్లాడామని విష్ణుకుమార్ రాజు చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించినట్టేనన్నారు. రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మహిళలపై, కేకే రాజుపై విష్ణుకుమార్ రాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్పొరేటర్లు పి.ఉషశ్రీ, సాడి పద్మారెడ్డి మాట్లాడారు. అనంతరం విష్ణుకుమార్ రాజుపై ఫోర్తుటౌన్ సీఐ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, బి.రాధ, కె.సుశీల, లక్ష్మి, సుజాత, శిరీష, రత్నం, రమణమ్మ, సునీత, సరస్వతమ్మ, శ్యామల, పద్మ, లలిత, రమాదేవి, గౌష్య, విజయలక్ష్మి, సుశీల,రాజకుమారి పాల్గొన్నారు.



మేయర్ హరి వెంకటకుమారి

మహిళల మనోభావాలు దెబ్బ తీయకూడదు : మేయర్

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మహిళల మనోభావాలు దెబ్బ తీసేలా మాట్లాడడం బాధాకరమని నగర ప్రథమ పౌరురాలిగా, ఓ మహిళగా తీవ్రంగా ఖండిస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. శాసనసభ్యుడిగా పని చేసిన విష్ణుకుమార్‌రాజు మహిళలను కించపరిచేలా మాట్లాడడం విచారకరమన్నారు. మహిళల ఆత్మగౌరవం దెబ్బ తీయకూడదని సూచించారు.

ఈకోర్సా, ప్రకాశం జట్ల విజయం

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీలో ఈకోర్సా, ప్రకాశం జిల్లా మెన్ జట్లు తొలి మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. ఈకోర్సా వాల్తేర్ ఆధ్వర్యంలో రైల్వే స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతున్న ఈ పోటీల్లో మెన్‌లో ఎనిమిది జట్లు, వుమెన్‌లో నాలుగు జట్లు పోటీపడుతున్నాయి. శుక్రవారం జరిగిన మెన్ పోటీల్లో ఈకోర్సా జట్టు 2–0తో తూర్పు గోదావరి జట్టుపై, ప్రకాశం జిల్లా జట్టు హోరాహోరీ పోరులో 2–1 సెట్ల తేడాతో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించాయి. అలాగే తూర్పుగోదావరి జిల్లా జట్టు 2–0తో సాట్స్ హైదరాబాద్ జట్టుపై, కిట్ వర్సిటీ జట్టు 2–0తో సాయిహాస్టల్ యానాం జట్టుపై, శ్రీకాకుళం జట్టు 2–0తో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జట్టుపై గెలుపొందాయి. వుమెన్‌లో కిట్స్ వర్సిటీ జట్టు 2–0తో ఎస్‌బీపీ జట్టుపై, పి.కె.ఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల జట్టు 2–0తో ఎస్‌బీపీ జట్టుపై విజయం సాధించాయి.

'కలియుగం పట్టణంలో' చిత్ర యూనిట్ సందడి

బీచ్‌రోడ్డు: ప్రేమ, తల్లి సెంటిమెంట్‌తో కూడిన ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'కలియుగం పట్టణంలో' చిత్రం నిర్మితమైందని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని హీరో విశ్వ కార్తికేయ, హీరోయిన్ ఆయూషి పటేల్ కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరంలో సందడి చేశారు. ఈ సందర్భంగా బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో, హీరోయిన్ మాట్లాడారు. చిత్రంలో ప్రతీ సన్నివేశం ప్రేక్షకులను ఉద్వేగానికి గురి చేస్తుందన్నారు. నటుడు నరేన్ రామ్ పాల్గొన్నారు.

తైనాల ఇంట్లో చోరీ కేసులో దొంగ దొరికాడు

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గురువారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆయన భార్యను కత్తితో బెదిరించి ఆమె పది తులాల బంగారు ఆభరణాలతో పాటు బీరువాలో ఉన్న నగదు చోరీ చేసిన సంగతి తెలిసిందే. వెంటనే విచారణ ప్రారంభించిన పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగను గుర్తించారు. తైనాల బంధువే చోరీకి పాల్పడినట్లు నిర్ధారించి, విచారిస్తున్నారు. ఈ విషయమై రెండో పట్టణ పోలీసులను వివరాలు అడగ్గా.. దొంగ దొరికాడని, అతన్ని విచారిస్తున్నట్లు తెలిపారు.

సురక్ష శిబిరాల్లో 752 మందికి పరీక్షలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శుక్రవారం నగరంలోని రెండు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. పద్మనాభం మండలం కొవ్వాడ, ఆనందపురం మండలం ఆనందపురం గ్రామంలో ఈ శిబిరాలు కొనసాగాయి. 752 మంది వైద్య సేవలు పొందారు. ఎనిమిది మందిని మెరుగైన వైద్యం కోసం వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.